

## 7న ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో ఏప్రిల్ ఏడవ తేదీన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించనునన్నట్లు రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, ఇతర వైద్యులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి సంబంధించి కొత్త సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ ఏడవ తేదీన కొత్త సభ్యులతో ప్రమాణస్వీకారం చేయిస్తామని పేర్కొన్నారు. అన్నమయ్య నూతన జిల్లా, రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణానికి కృషి చేసిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డేవిడ్ సుకుమార్, వైద్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# పేదరికం లేని సమాజమే ప్రభుత్వ లక్ష్యం

**- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి**

ప్రజాశక్తి-చిన్నమండెం

రాష్ట్రంలో పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య ఉద్దేశమని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వానికి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్ళు లాంటివని ముఖ్యమంత్రి రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో ముందుకు తీసుకెళుతున్నామని తెలిపారు. ఎక్కడా లేనివిధంగా మన రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ పెన్షన్లు అందజేసి ప్రతినెలా ఒకటవ తేదీనే అవ్వతాతల ఇంటికి వెళ్లి వారికి పెన్షన్ డబ్బులు ఇస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికి ఇల్లు నిర్మించాలనే ఉద్దేశంతో నూతన విధివిధానాల ద్వారా అర్హులందరికీ ఇల్లు మంజూరు చేసి పేదల సొంతింటి కల నెరవేరుస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు.

### రూ.80 లక్షలతో సిసి రోడ్డుకు భూమిపూజ

**గాలివీడు :** మండలంలోని అరవీడు, గాలివీడు గ్రామాలలో రూ.80 లక్షలతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణానికి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మించి గ్రామాలను ఆదర్శంగా తీర్చి దిద్దుతామన్నారు. మండలంలోని పక్కిరారెడ్డిపల్లి, వివిఎస్ఆర్ నగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి సర్పంచ్ పార్థసారధిరెడ్డి మాజీ సర్పంచ్‌లు బి.కె.మహ మ్మద్‌రి యా, భద్రప్ప నాయుడు, టిడిపి నాయకులు కొండ్రెడ్డి. శ్రీకాంత్, హేమ కుమార్, నూరుల్లా, సత్యం, సాయినాథ్‌రెడ్డి, సూరి, ఆనందు, లక్ష్మయ్య, మల్‌రెడ్డి, వెంకట శివారెడ్డి, తహశీల్దార్ భాగ్యలత, ఎంపిడిఒ జవహర్‌బాబు, శేఖర్‌రెడ్డి, వెంకటాద్రి నాయుడు, వెంకటరమణ పాల్గొన్నారు.

### పేదలకు వరం సిఎం సహాయనిధి

**రాయచోటి :** సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని స్టేట్ గెస్ట్ హౌస్‌లో ఆరుగురు బాధితులకు రూ.11.23 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. తిక్కల భరత్ కుమార్‌కు రూ.60,533, మార్కాపురం కృష్ణయ్యకు రూ.42,085, కె.ఉస్మాన్‌బాషాకు రూ.31,192, అతికారి గౌరీకి రూ.4 లక్షలు, ఎడ్లమూడి భ్రమరాంబకు రూ.ఏడు లక్షలు, కావలి వెంకటరమణకు రూ.2.50 లక్షల చెక్కులను అందజేశారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం కొండంత భరోసాని స్తోందన్నారు. పేదల ఆరోగ్య సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలవెన్నంటి ఉంటుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.



చిన్నమండెం : అర్జీదారులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

### ఇఫ్తార్ విందులో మంత్రి మండిపల్లి

**రామాపురం :** మండలంలోని గువ్వల చెరువులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో పుణ్య కార్యమన్నారు. మనిషి సత్ప్రవర్తనతో నడవడానికి రంజాన్ ఉపవాసాలు ఉపకరిస్తాయని ఉపవాస దీక్షలు ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదర భావం, మానవత్వం వంటి సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ ఉపవాసాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరూ దైవ మార్గంలో నడవాలని మంత్రి ఆకాంక్షించారు. కార్యక్రమంలో గువ్వలచెరువు ముస్లిం పెద్దలు, టిడిపి నాయకులు గాజులు ఖాదర్ బాషా పాల్గొన్నారు

### అజెండా రద్దు చేయాలని

# కమిషనర్‌పై కౌన్సిలర్ల తిరుగుబాటు

- అభివృద్ధికి అడ్డుగా ఉన్నారని ఆగ్రహం
- కౌన్సిల్‌ను బహిష్కరించి కౌన్సిలర్ల నిరసన

ప్రజాశక్తి-మదనపల్లె

మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ అధ్యక్షతన శనివారం నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో అజెండాను రద్దు చేయాలని వైసిపి పార్టీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశంలో కమిషనర్ ప్రమీలపై కౌన్సిలర్లు నిరసన వ్యక్తం చేశారు. అభివృద్ధికి అడ్డుగా ఉన్నావంటూ కమిషనర్‌పై కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధికి నోచుకోని అజెండాను కౌన్సిల్ సమావేశం ముందుకు తీసుకొచ్చిన అజెండా పత్రాలను చించేసి నిరసన వ్యక్తం చేసి సమావేశాన్ని బహిష్కరించారు. ఇందుకు పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని కమిషనర్ ప్రమీల కౌన్సిలర్లకు సూచించినా ఈ అజెండాను మెజార్టీ సభ్యులుగా తాము ఆమోదించడం లేదని, పూర్తిగా రద్దు చేయాలని చైర్‌పర్సన్ వరపన మనూజను కోరారు. సమావేశంలో చైర్‌పర్సన్ మాట్లాడుతూ వేసవి దృష్ట్యా నీటి సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పారిశుధ్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. పట్టణంలోని 35 వార్డుల్లో ప్రజల సమస్యలు ఉన్నట్లయితే కౌన్సిల్ సమావేశం దృష్టికి తీసుకురావాలని కోరారు.. అనంతరం ఆరో వార్డు కౌన్సిలర్ ప్రసాద్ బాబు తమ వార్డులో ఇంటి పన్నును ముక్కు పిండి వసూలు చేస్తున్నారని అధికారులపై మండిపడ్డారు. ప్రజలకు కొంత గడువు ఇవ్వమని అడుగుతున్న కనికరము లేకుండా దురుసలాడడం సబబు కాదన్నారు. మున్సిపాలిటీకి పన్నులు కట్టే ప్రజలు కోరిన విధంగా కాలువలు, రోడ్లు, ఎందుకు వేయడం లేదని నిలదీశారు. జనరల్ ఫండ్ నుంచి ఆర్థిక నిధులు తీసుకునే హక్కు లేదా అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. వార్డులో ఎటువంటి అభివృద్ధి చేయలేకపోవడంతో ప్రజలు నిలదీస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లుగా కమిషనర్ ప్రమీల అభివృద్ధికి అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. ఆర్వో ప్లాంట్ రాకుండా పోవడానికి ప్రధాన కారణం కమిషనర్ అని మండిపడ్డారు. అనంతరం వైస్ చైర్మన్ జింక వెంకటాచలపతి మాట్లాడుతూ 2024-25 మార్చి నాటికి స్మశాన వాటికకు ఎంత బడ్జెట్ కేటాయించారని ప్రశ్నించడంతో అధికారులు నీళ్లు నమిలారు. 35 వార్డులలో ఎన్ని నీటి బోర్లు ఉన్నాయి, ఎన్ని పని చేస్తున్నాయి, ఎన్ని కొత్తగా నీటి బోర్లు వేశారు వంటి ప్రశ్నలను సంధించారు. ప్రస్తుతం వేసవికాలం దృష్ట్యా అధికారులు చాలా నిర్లక్ష్యంగా ఉన్నారని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకువచ్చారు. వేసవికాలం దృష్ట్యా ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలని చైర్‌పర్సన్ ద్వారా అధికారులను కోరారు. 17 మంది కార్మికులను తీసేయడానికి కారణాలు చెప్పాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల మంది జనాభా ఉన్నచోట కార్మికుల కొరత లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత లేదా అని నిలదీశారు. పరిపాలన పై అధికారులకు ఎందుకు శ్రద్ధ పెట్టడం లేదన్నారు. అధికారులు నుండి సమాధానం కోసం వేచి చూస్తుండగా ఇంతలో ఎమ్మెల్యే షాజహాన్ బాషా సమావేశానికి విచ్చేశారు. వైసిపికి చెందిన కౌన్సిలర్లు కమిషనర్ డౌన్ డౌన్ అంటూ నిరసన వ్యక్తం చేశారు. వార్డులలో వర్కులు చేయనీయకుండా అడ్డుపడుతున్న కమిషనర్‌పై కౌన్సిలర్లు షేక్ కరీముల్లా, గాంధీ, మందపల్లి వెంకటరమణ, శ్రీనివాస్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఎందుకు అడ్డుపడుతున్నారని కమిషనర్‌ను ఎమ్మెల్యే కోరారు. స్పందించిన కమిషనర్ వార్డులలో వర్కులు ప్రపోజల్ పెడుతున్నామని కానీ కాంట్రాక్టర్లు చేసేందుకు ముందుకు రావడంలేదని బదులిచ్చారు. ప్రతి వార్డ్ కౌన్సిలర్ నుండి వర్కులకు సంబంధించి జాబితాను తీసుకోవాలని కమిషనర్ ప్రమీలకు సూచించారు. అజెండాను రద్దుచేసి తాము కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు కౌన్సిలర్లు చైర్‌పర్సన్ మనూజకు తెలియజేసి వెనుతిరిగారు. సమావేశంలో కౌన్సిలర్లు ఖాజా హుస్సేన్, పాల్ చంద్రశేఖర్, ఎస్వీ రమణ, ఈశ్వర నాయక్, రామిశెట్టి శివయ్య, తులసి రామకృష్ణ, గిరిజ సాయి శేఖర్ రెడ్డి, సుగుణ ఆంజనేయులు, రజిని నరేంద్ర, సరిత, బాలగంగాధర్‌రెడ్డి పాల్గొన్నారు.



పోడియం కింద కూర్చుని నిరసన తెలుపుతున్న కౌన్సిలర్లు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రామలింగారెడ్డి

## 'ఆదిత్య'లో జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం విజయవంతం

ప్రజాశక్తి-మదనపల్లె

దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల వినూత్న ప్రతిభను ప్రదర్శించే జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవాన్ని శనివారం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఇటీవల నిర్వహించింది. ప్రోగ్యోత్సవ్-2కె25, అనోఖ-2కె25, అథర్వ-2కె25 బ్యానర్ల కింద జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ (ఎఐ) విభాగాలు నిర్వహించాయని పుంగనూరు రోడ్డులోని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి పేర్కొన్నారు. ఈ ఉత్సవంలో పేపర్ ప్రెజెంటేషన్ పోటీలు, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు మరియు సాంకేతిక క్విజ్‌లతో సహా అనేక రకాల ఉత్తేజకరమైన కార్యక్రమాలు జరిగాయని పేర్కొన్నారు. వివిధ సంస్థల నుండి విద్యార్థి ఔత్సాహికులు ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు. కంప్యూటర్ సైన్స్ యొక్క అభివృద్ధి చెందుతున్న రంగాలలో వారి నైపుణ్యాలను, జ్ఞానాన్ని ప్రదర్శించారని తెలిపారు. విద్యార్థులు వారి నైపుణ్యాలను, జ్ఞానాన్ని నవీకరించడానికి ఇటువంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనడం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. వివిధ రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యొక్క అనువర్తనాలగురించి వివరించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె.సతీష్ బాబు, డీన్-అకడమిక్స్ డాక్టర్ వి.వి.ఎన్.భాస్కర్, అన్ని విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పల్లా శ్రీనివాసరావును కలిసిన చమర్తి సురేష్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తెలుగుదేశం పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును శనివారం పార్టీ కేంద్ర కార్యాలయంలో మదనపల్లె ఎన్నికల సమన్వయకర్త, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చమర్తి సురేష్ రాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చమర్తి సురేష్ రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఇటీవల జరుగుతున్న తాజా పరిస్థితులపై రాష్ట్ర అధ్యక్షులకు క్షుణ్ణంగా వివరించానని పేర్కొన్నారు. త్వరలోనే జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటన ఉంటుందని తెలిపారు. ఆయన దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలియజేశారు.

# జిల్లాలో తాగునీటి సమస్య ఉండకూడదు

**- కలెక్టర్ చామకూరి శ్రీధర్**

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో ఎక్కడ కూడా తాగునీటి సమస్య ఉండకూడదని, ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఒకటో తారీకు పింఛన్ల పంపిణీకి సిద్ధంగా ఉండాలని, జిల్లాలో పదివేల ఎకరాలలో పచ్చగడ్డి పండించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి అధికారులను. శనివారం సాయంత్రం రాయచోటి కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి అన్ని మండలాల ఎంపిడిఒలు, పంచాయతీరాజ్ శాఖ సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ శాఖ సిబ్బంది, తదితరులతో వేసవి కాలంలో తాగునీటి సమస్య లేకుండా చూసేందుకు తీసుకోవాల్సిన చర్యలు, పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీల పరిష్కారాలు, పల్లె పండుగ పనులు, గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు, ఎన్టీఆర్ హౌసింగ్ పథకం, తదితర అంశాలపై కలెక్టర్ శ్రీధర్ చామకూరి సంబంధిత శాఖ జిల్లా అధికారులు ఎంపీడీవోలు శాఖల సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందరేగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో జిల్లాలో తాగునీటి సమస్య కనిపించకూడదని దానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి కాలంలో డయేరియా కు గురికాకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎన్జీవోలు దాతలతో సమన్వయం చేసుకొని ప్రజలందరికీ చలివేంద్రాలు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. నేటి సదుపాయం ఉండే చోట్లలో సరైన విధంగా క్లోరినేషన్ చేయించాలని ఆదేశించారు. ఆర్డబ్ల్యూఎస్ వన్‌ఆప్‌ను ఉపయో గించుకొని అవసరమైన చోట్ల నీటి సదుపాయం ఉండేలా చూడాలన్నారు. పింఛన్ల పంపిణీ పై సమీక్షిస్తూ ఈ నెల 30, 31వ తేదీలు బ్యాంకు సెలవులు ఉన్నందున ఈరోజే నగదును తీసుకొని పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచుకోవాలని పేర్కొన్నారు. ఒకటో తారీకు ఉదయం 7 గంటల నుండి పంపిణీ జరగాలని ఆదేశించారు.పల్లె పండుగ పనులపై సమీక్షిస్తూ పెండింగ్లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీరాజ్ శాఖ సిబ్బందిని ఆదేశించారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే అర్జీలను నాణ్యతతో, అర్జీదారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని సూచించారు. గ్రామీణ ఉపాధి హామీ పనులపై సమీక్షిస్తూ పెండింగ్లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పశువులు ఇబ్బంది పడకుండా నీటి తొట్టెలు నిర్మించాలని ఇప్పటికే 200 నీటి తొట్టెలు పూర్తయ్యాయని మరో వెయ్యి వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్టీఆర్ హౌసింగ్ ప్రజా కంపెనీ సమీక్షిస్తూ కొన్ని మండలాలలో స్టేజి కన్వర్షన్ అవ్వాల్సిన పనులు పెండింగ్లో ఉన్నాయని వీటిని వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వర్క్ ఫ్రం హోం సర్వేపై సమీక్షతో జిల్లాలో 64 శాతం పూర్తయిందని పూర్తి చేయని మండలాలలో వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీవోలను ఆదేశించారు. అన్నమయ్య జిల్లా వ్యవసాయ ఆధారిత జిల్లాను మన జిల్లాలో 100 రూపాయల లో 21 రూపాయల ఆదాయం ఉద్యానవన శాఖ నుంచి మరో 21 రూపాయల ఆదాయం పశుపోషణ ద్వారా వస్తుందని కేవలం ఐదు శాతం మాత్రమే వ్యవసాయం మీద ఆదాయం వస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో 18 శాతం ఉపయోగంలో లేని భూమి ఉందని ఇందులో పశుగ్రాసం పండిస్తే పశువులకు అందుబాటులోకి వచ్చి పశువుల మీద ఆధారపడి జీవించే వారికి ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు.ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో పదివేల ఎకరాలలో పచ్చగడ్డి పండించాలని, కనీసం రెండు మండలాలు ఈ ప్రక్రియను ఎస్‌హెచ్‌జిలతో సమన్వయం చేసుకొని పండించి ఎంత ఆదాయం వస్తుందో చూడాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



విసిలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

## వడగాల్పుల వేళ అప్రమత్తత అవసరం

**ప్రజాశక్తి-రాయచోటి :** ప్రజలు వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు మధ్యాహ్నం బయటకు రాకుండా ఉండాలని, పళ్ళ రసం, కొబ్బరినీరు, ఉప్పు కలిపిన నీరు ఎక్కువగా తాగాలని తెలిపారు. వడగాలుల నుండి సంరక్షించుకునేందుకు టోపీ, గొడుగును ఉంచు కోవాలన్నారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు తాగాలన్నారు. ప్రజలు ఎక్కువగా తిరిగే చోట్ల ఏర్పాటు చేసే చలివేంద్రాలను వినియోగించుకోవాలని తెలిపారు.

## విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటిలోని మార్కెట్ ఉర్దూ పాఠశాలలో ఆజాద్ ఎడ్యుకేషనల్ అండ్ మైనారిటీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పేద విద్యార్థులకు రంజాన్ కానుక కింద నగదును ప్రోత్సాహకంగా అందజేశారు. రాయచోటికి చెందిన పలు ఉర్దూ పాఠశాలల నుండి 100 మంది పేద విద్యార్థులకు ఎంపిక చేసి ఒక్కొక్క విద్యార్థికి రూ.500 చొప్పున రూ.50 వేలు నగదు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెస్కో అసిస్టెంట్ డైరెక్టర్ చాంద్ బాషా పాల్గొని విద్యార్థులకు నగదు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆజాద్ సొసైటీ వారి సేవలు అమూల్యమైనవి అని పేర్కొన్నారు. ఆజాద్ అంబులెన్స్, నిరుపేదలకు రోజువారి సరుకుల పంపిణీ, పేద అమ్మాయిల పెళ్లిళ్లకు ఆర్థిక సహాయం చేయడం సంతోషదాయమని పేర్కొన్నారు. పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం మొదలైన సేవా కార్యక్రమాల గురించి కొనియాడారు. కార్యక్రమంలో ఆజాద్ సొసైటీ అధ్యక్షులు షాహుల్ హమీద్, సెక్రటరీ సిబాతుర్ రెహమాన్, కోశాధికారి ముహీబుల్లా, ఉపాధ్యక్షులు మహమ్మద్ అలీ, ఇలియాస్, జాయింట్ సెక్రటరీ జాఫరుద్దీన్, తెలుగుదేశం పార్టీ నాయకులు లోకం బీడీ అష్రఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నగదు అందజేస్తున్న చాంద్‌బాషా



ప్రభాకర్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

## న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా ప్రభాకర్‌రెడ్డి


ప్రజాశక్తి-రాయచోటి

రాయచోటి బార్ అసోసియేషన్ ఎన్నికల్లో శనివారం జరిగిన ఉత్కంఠ పోరులో రాయచోటి బార్ సోసియేషన్ అధ్యక్షులుగా ఎన్.ప్రభాకర్‌రెడ్డి విజయం సాధించారు. పోలైన 87 ఓట్లలో 48 ఓట్లు ప్రభాకర్‌రెడ్డికి రాగా ప్రత్యర్థి రమేష్‌రెడ్డికి 39 ఓట్లు మాత్రమే వచ్చాయి. ఉపాధ్యక్షులుగా ప్రభాకర్‌రెడ్డి ప్యానెల్‌గా ఉన్నయి. ధనుంజయ్ కుమార్ ప్రత్యర్థి రామచంద్రారెడ్డిపై ఒక్క ఓటుతో గెలిచారు. ప్రధాన కార్యదర్శిగా పి.రెడ్డిబాషా తన ప్రత్యర్థి పగడాల శ్రీనివాసులపై 11 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ట్రెజరర్‌గా పోటీచేసిన ఆదిరెడ్డి నాయక్ తన ప్రత్యర్థి అయిన నాగరాజపై నాలుగు ఓట్ల మెజారిటీతో గెలిచారు. లైబ్రరీ సెక్రటరీగా టి.వి.రమణ తన ప్రత్యర్థి రామ్ కుమార్‌పై రెండు ఓట్ల మెజారిటీతో గెలిచారు. స్పోర్ట్స్ కార్యదర్శిగా వేల్పుల సిద్దయ్య తన ప్రత్యర్థి కుంచపు బాలచంద్రపై 15 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఎన్నికల అధికారిగా కె.రాజ్ కుమార్ రాజు వ్యవహరించి సాయంత్రం 6 గంటలకు గెలిచిన అభ్యర్థులందరికీ అందరికీ డిక్రెషన్ ఫామ్స్ అందజేశారు. ప్రభాకర్‌రెడ్డి ప్యానల్ అభ్యర్థులు గెలిచిన సందర్భంగా ఆయన మద్దతుదారులు అందరూ కూడా బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు.

## విద్యుత్ సర్వీసులను క్రమబద్ధీకరించుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇంటి సర్వీసుల అడిషనల్ లోడ్‌ను క్రమబద్ధీక రించుకోడానికి రాయితీ అవకాశం కల్పిస్తున్నట్లు ఎపిఎస్‌పి డిసిఎల్ అన్నమయ్య జిల్లా పర్యవేక్షణా ధికారి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన పీలేరులో మీడి యాతో మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు ప్రస్తుతం వినియోగిస్తున్న అదనపు విద్యుత్ లోడును క్రమబద్ధీకరిం చుకున్నట్లైతే వారు చెల్లించాల్సిన డెవలప్మెంట్ ఛార్జీలు ఒకేసారి చెల్లించేటట్లైతే తాము చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం రాయితీ పొందవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశం 2025 మార్చి 1 నుండి జూన్ 30 వరకు మాత్రమే ఉంటుందని తెలియజేశారు. ఈ నెల 30, 31వ తేదీల్లోనూ విద్యుత్ బిల్లులు చెల్లించుకునేందుకు విద్యుత్ సంస్థకు చెందిన అన్ని కలెక్షన్ సెంటర్లను తెరచి ఉంచబడతాయని, కావున వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యుత్ బిల్లులు చెల్లించాలని కోరారు.



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

## పండుగలు సంతోషంగా జరుపుకోవాలి

**ప్రజాశక్తి-రాయచోటి :** తెలుగు నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు సుఖఃసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కలెక్టర్ శ్రీధర్ వేర్వేరు ప్రకటనలో జిల్లా ప్రజలందరికీ తెలుగు నూతన సంవత్సర శ్రీ విశ్వావసు నామ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డిఆర్ఒ మధుసూదనరావు జిల్లా ప్రజలకు నూతన తెలుగు సంవత్సర ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. వ్యవసాయాధారిత జీవనం సాగించే తెలుగు రాష్ట్రాలలో ఉగాది పండుగకు ప్రత్యేకత ఉందని షడ్రుచుల కలయికతో పులుపు, తీపి, వగరు, చేదు, ఉప్పు, కారం అనే ఆరు రుచుల కలయికగా ఉగాది పచ్చడిని రూపొందిస్తారన్నారు. వైద్యపరంగా ఈ ఉగాది పచ్చడి వేసవి వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుందన్నారు. ఆధ్యాత్మికంగా చూస్తే జీవితం సుఖదుఃఖాల మిశ్రమం అని చెప్పడమే ఉద్దేశ్యంగా ఉగాది జోస్యం చెబుతుందన్నారు. జీవితం శుభాశుభాల మిశ్రమం అని గ్రహిస్తూనే రాబోయే రోజులకి సిద్ధపడాలనే సూచనని అందించేదే మన సంప్రదాయ పంచాంగం అన్నారు. అందుకనే సంవత్సరపు మొదటిరోజైన ఉగాది నాడు పంచాంగ శ్రవణం తప్పక ఆలకించాలని పెద్దలు చెబుతారని గుర్తు చేశారు. సంప్రదాయబద్ధంగా ఇంటిల్లిపాదీ బంధుమిత్రులతో ఆనందంగా పండుగ జరుపుకోవాలన్నారు.

**మదనపల్లె అర్బన్:** మత సాంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను జరుపుకోవాలని, ఒకేసారి రెండు పెద్ద పండుగలు రావడం గొప్ప విషయమని ఆహ్లాదకరమైన వాతా వరణంలో ఉగాది, రంజాన్ పండుగలను నిర్వహించాలని మదనపల్లె వైసిపి కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త ఎస్.నిస్సార్ అహమ్మద్ ప్రజలకు సూచించారు. నూతన తెలుగు సంవత్సరాది ఉగాది, నెల రోజుల పాటు ఎంతో పవిత్రంగా ఉపవాస దీక్షలు ఆచరించి జరుపుకునే రంజాన్, ప్రపంచానికి ఆదర్శవంతమైన జీవన విధానాన్ని అందించిన సీతారాముల పండుగ శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. మత సంప్రదాయాలను గౌర విస్తూ శాంతియుత, ఆహ్లాదకర వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని కోరారు.

# ఖాతాదారుల కోసం మరిన్ని సేవలు : చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నాదేళ్ల విద్యా సాగర్

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ 2024 2025 రెండవ సాధారణ మహాసభ స్థానిక యన్. వి. ఆర్ కళ్యాణ మండపంలో బ్యాంక్ చైర్మన్ నాదేళ్ల విద్యాసాగర్ ఆధ్వర్యంలో సాధారణ సమావేశాన్ని శనివారం నిర్వహించారు ఈ సమావేశంలో సీఈవో బ్యాంకు యొక్క తీర్మానాలను ప్రవేశపెట్టగా సభ్యులు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం చైర్మన్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ మదనపల్లి కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ మన అందరిదని దీనికి కాపాడుకోవాల్సిన బాధ్యత మదనపల్లి ప్రజలపై ఉందన్నారు.ఖాతాదారుల కోసం మరిన్ని సేవలు అందిస్తున్నామన్నారు. బ్రిటిష్ కాలంలో అప్పటి చట్టాలకనుకూలంగా గంగారావు పెద్దిరెడ్డి ఆధ్వర్యంలో 1924లో స్థాపించారని అప్పటినుంచి అంచలంచెలుక ఎదిగి నేడు 150 కోట్లకు పెట్టుబడుల తో ముందుకు వెళుతుందన్నారు అంతేకాకుండా మదనపల్లి నుంచి బ్యాంక్ యొక్క వ్యాపార పరిధిని రాయలసీమ ప్రాంతానికి విస్తరించేలా సంబంధించిన అధికారులకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. బ్యాంక్ నందు డిపాజిట్లు 90.55 కోట్లుగా ఉండగా రావలసిన అప్పులు 64.53 ఉన్నాయని బ్యాంకు యొక్క సొంత నిధులు12.11 కోట్లు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం ఒక రూపాయి వడ్డీతోనే ప్రజలకు అనేక రకాల అప్పులను అందిస్తున్నామన్నారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకుని నూట ఒకటో సంవత్సరంలో అడుగుపెట్టడంతో మే నెలలోశత వార్షికోత్సవ సంబరాలు మూడు రోజులపాటు ఘనంగా నిర్వహిస్తామని ఆ సంబరాలకు రాష్ట్రవ్యాప్తంగా స్థానిక ఎమ్మెల్యే తో పాటు మంత్రులను వివిధ పట్టణాలలో ఉన్న టౌన్ బ్యాంక్ సి ఓ లను ఆహ్వానిస్తామని తెలిపారు. ప్రస్తుతం తమ బ్యాంకులో మొబైల్ బ్యాంకింగ్ సదుపాయం కూడా కల్పించామన్నారు. వ్యాపారవేత్తలకు బంగారు నగలపై డైలీ లోన్, టర్మ్‌లోన్ ఓవర్ డ్రాఫ్ట్ సదుపాయం కొనసాగిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భాస్కర్(మహర్షి)సి ఈ ఓ. పి. వి. ప్రసాద్, మేనేజర్ రవిచంద్రారెడ్డి, డైరెక్టర్లు రాటకొండ సోమశేఖర్, నాదేళ్ల శివ, ముక్తియార్, సర్దార్, పసుపుపాడి రవి, భాస్కర్, ఖాతాదారులు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

## తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరు

**ప్రజాశక్తి-గాలివీడు**

ఉపాధి హామీ పనులలో తప్పు చేసిన వారు శిక్ష నుంచి తప్పించుకోలేరని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన ఓపెన్ ఫోరంలో ఆయన మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేదల కోసం కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేసిందని అన్నారు. కూలీల డబ్బులు కాజేయాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని పేర్కొన్నారు. 17 గ్రామాలలో రూ.1,03,633లు రికవరీకి తేలి నదని తెలిపారు. ప్రతి గ్రామంలో కూడా రికవరీ జరుగుతుందంటే ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. నలుగురు టిఎల పైన క్రమశిక్షణ చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జవహర్‌బాబు, సిఆర్‌పి, డిఆర్‌పిలు, ఎపిఒలు రామచంద్రయ్య, హరిప్రసాద్, టెక్నికల్ అసి స్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉపాధి కూలీలు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిట్లూరు సర్పంచ్‌కు 'గడికోట' పరామర్శ

**ప్రజాశక్తి-రామాపురం**

మండలంలోని చిట్లూరు సర్పంచ్ రామాంజులును వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించారు. రామాంజులు అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల చిన్న శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. శ్రీకాంత్ రెడ్డి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుని త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. వైసిపి నాయకులు విశ్వనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జిల్లా మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు సగినాల శివ శంకర్, రాచరాయుడు, భద్రయ్య, ఓబులేసు, సాంబశివ పాల్గొన్నారు.




కానిస్టేబుల్‌ను సన్మానిస్తున్న సిఐ, పోలీసు సిబ్బంది

## హెడ్ కానిస్టేబుల్‌కు సన్మానం

**ప్రజాశక్తి-కలకడ**

మండల కేంద్రం కలకడ పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సునీల్‌శశికుమార్‌ను బదిలీపై వెళ్లడంతో సిఐ గురునాథ పూలమాల, దుశ్శాలువాలతో ఘనంగా సన్మా నించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సునీల్ శశికుమార్ సర్కిల్ కార్యాలయంలో ఎంతో నిబ ద్ధతతో క్రమశిక్షణ కలిగి విధులు నిర్వహించేవాడని అభినందించారు. అలాంటి వ్యక్తి బదిలీపై వెళ్లడం బాధాకరమైనప్పటికీ ఉద్యోగస్తులకు బదిలీలు తప్పనిసరి అన్నారు. హెడ్ కానిస్టేబుల్ సునీల్ శశికు మార్ పీలేరుకు బదిలీపై వెళ్లడం జరిగిందని అక్కడ కూడా మంచి పేరు ప్రతిష్టలు సంపాదించు కో వాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తిరుపాల్, అమర్నాథ, అర్జున, రమేష్ పాల్గొన్నారు.

### పోలీసు కానిస్టేబుల్ మెయిన్స్
## పరీక్ష తేదీలు ప్రకటించాలి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)**

రాష్ట్ర ప్రభుత్వం పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ప్రభుత్వం వెంటనే స్పందించి కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ప్రొద్దుటూరులో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం 2022 నవంబర్ 28న 6100 పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చారని, జనవరిలో జరిగిన ప్రిలిమ్స్ పరీక్షకు 4.52 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారని పేర్కొన్నారు. ఇందులో 92 వేల మంది అర్హత సాధించారన్నారు. రెండేళ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించారని, ఇప్పుడు కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి పది నెలలు గడుస్తున్నా నిరుద్యోగులకు ఒరిగింది ఏమి లేదన్నారు. ఇప్పటికే పోలీస్ శాఖలో 20వేలు దాక పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మరి వాటి సంగతి ఏమిటని ప్రశ్నించారు. గత మూడేళ్లుగా నిరుద్యోగులు కోచింగ్ ఫీజులు, రూం అద్దెలు కట్టలేక, పుస్తకాలు కొనలేక ఇంటిని కుటుంబాన్ని వదిలేసి చదువుకుంటుటే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గు చేటున్నారు. యువగళంలో లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ అధికారంలోకి రాగానే గొంతు ముగబోయిందిన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థులకు కోర్టు కేసులు క్లియర్ చేసి మెయిన్స్ పరీక్షల తేదీలను ప్రకటించాలని కోరారు. కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

## సమానమైన సేవలు అందించాలి

**ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్**

కుష్టు వ్యాధి గ్రస్తులకు అందరితో పాటు సమానమైన సేవలు అందించాలని జాతీయ హెచ్‌ఆర్‌సి డాక్టర్ ప్రదీప్త కుమార్ నాయక్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖాధికారి కార్యాలయంలో ప్రత్యేక పర్యవేక్షణ అధికారి జాతీయ హ్యూమన్ రైట్స్ కమిషనర్ డాక్టర్ ప్రదీప్త కుమార్ నాయక్ అధ్యక్షతన సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వ్యాధి గ్రస్తులకు సంబంధించిన సేవలు, వారి హక్కులపై సమన్వయ కమిటీ అధికారులతో చర్చించారు. వ్యాధి గ్రస్తులకు మెరుగైన సేవలు అందించడానికి వాటికి సంబంధించిన సల హాలు సూచనలు ఇచ్చారు. ప్రతి శాఖ వారు అందించే సేవలు ప్రభుత్వ పథకాలలో లేప్రోసి వ్యాధి గ్రస్తుల జాబితాను తయారు చేసు కొని వారికి వందశాతం సేవలు అందేటట్లు చూడాలని ఆదేశించారు. టిబి, ఎయిడ్స్, కుష్టు వ్యాధులు ప్రబలకుండా సరైన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవ సాగర్, జిల్లా ఉప వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి బాబు, డిపిఎం సుబ్బారెడ్డి, ఫిజియోథెరపీ డాక్టర్ మనోహర్, స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రఫీక్‌షాషా పాల్గొన్నారు.



# ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



రాజంపేట : ఎన్‌టిఆర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న టిడిపి నాయకులు

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, వారి సంక్షేమం కోసం నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించారని జిల్లా టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు పేర్కొన్నారు. 43 సంవత్స రాలు పూర్తి చేసుకున్న టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాజంపేట నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ జెండా ఎగరవేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాల వేసి చమర్తి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతి కోసం వేసిన అడుగు నేడు ప్రపంచంలోనే తెలుగు వారికి ప్రత్యేక గుర్తింపు తెచ్చిన పార్టీగా తెలుగుదేశం పార్టీ నిలిచిందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి:** టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను టిడిపి మండల అధ్యక్షుడు పుర్రా వెంకటరమణ, రాజంపేట పార్లమెంటరీ టిడిపి అధికార ప్రతినిధి ఆర్.జే వెంకటేష్, మాజీ మండల అధ్యక్షులు రాజన్న ఆధ్వర్యంలో మండల నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహిం చారు. కార్యక్రమంలో సర్పంచు పాపులమ్మ మల్లప్ప, నాయకులు రెడ్డప్ప రెడ్డి, మునిరత్నం, మల్లికార్జున, దేవేంద్ర రెడ్డి, శ్రీపతి పాల్గొన్నారు. **చిట్వేలి:** మండల పరిధిలోని కొత్త బస్టాండ్ ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద కాకర్ల సుబ్బరాయుడు అధ్యక్షతన ఏర్పాటు చేసిన టిడిపి ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ కేకే చౌదరి, డైరెక్టర్ అనిత దీప్తి పాల్గొన్నారు. **రామాపురం :** టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా లక్కిరెడ్డిపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎం.రమేష్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ టిడిపి ఉపాధ్యక్షుడు గడికోట విజయ భాస్కర్‌రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండలంలోని చిట్లూరు పంచాయతీ కస్పాలో గాలివీడు సురేంద్రనాథ్‌రెడ్డి, దేవదర్శన్‌రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి రామకృష్ణగౌడ్, కసిరెడ్డిగారిపల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురంలో చంద్రమౌళి నాయకులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. **కలికిరి:** టిడిపి మండల అధ్యక్షుడు నిజాముద్దీన్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కలికిరి క్రాస్ రోడ్ లో టిడిపి జెండా ఎగురవేసి ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు వేంపల్లి అబ్దుల్ ఖాదర్ పాల్గొన్నారు. **వీరబల్లి:** టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రప టానికి పూల మాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డప్పరెడ్డి, నాగ సుబ్బయ్య నాయుడు, రామ్మోహన్‌రెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షులు ఆంజనేయులురెడ్డి, మల్లయ్య యాదవ్ పాల్గొన్నారు. **పీలేరు:** పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి పిలుపు మేరకు నియోజ కవర్గ వ్యాప్తంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు పార్టీ శ్రేణులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు అమర్నాథ్‌రెడ్డి, బిసి నాయకులు పురం రామ్మూర్తి, సురేంద్ర, నల్లారి రియాజ్, లడ్డు జాఫర్, రమాదేవి పాల్గొన్నారు. **మదనపల్లి అర్బన్ :** రాష్ట్ర రాజకీయాల్లో తెలుగుదేశం పార్టీ పెను సంచలనాన్ని సృష్టించిందని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని పలు ప్రాంతాల్లో అటహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆయా ప్రాంతాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ నాయకులకు, కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. మదనపల్లె పట్టణంలోని నిమ్మనపల్లె సర్కిల్, మున్సిపల్ కార్యాలయం, నీరుగట్టువారి పల్లి, అన్న క్యాంటీన్, ఎన్టీఆర్ సర్కిల్లో నిర్వహించిన పార్టీ ఆవిర్భావ కార్యక్రమంలో పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** మండల టిడిపి యువ నాయకుడు యనమల మదనమోహన్ ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు:** మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలిలో టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి జెండా ఎగురవేసి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపు కున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మాజీ ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, మండల అధ్యక్షులు జంగం శెట్టి వెంకట సుబ్బయ్య, మాజీ అగ్రికల్చరల్ మార్కెటింగ్ చైర్మన్ విజయ సాగర్, క్లస్టర్ ఇన్‌ఛార్జి పసుపులేటి ప్రవీణ్, పల్లె సుబ్రహ్మణ్యం, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు రేవూరి వేణుగోపాల్ పాల్గొన్నారు.

### తంబళ్లపల్లిలో భగ్గుమన్న గ్రూపు రాజకీయాలు

**బి.కొత్తకోట :** టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మరోమారు టిడిపిలోని గ్రూపు రాజకీయాలు బహిర్గత మయ్యాయి. పట్టణంలో జి.శంకర్ వర్సెస్ జయచంద్రారెడ్డి గ్రూపులుగా విడిపోయి టిడిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు నిర్వహించుకున్నారు. పార్టీ అధిష్టానం తంబళ్లపల్లి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించి నియోజవర్గం అభివృద్ధికి పాటుపడే వ్యక్తికి ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించాలని శంకర్ మద్దతు దారులు డిమాండ్ చేశారు. సిఐ జీవన గంగానాథ్‌బాబు ఇరు గ్రూపుల మధ్య ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టారు. **తంబళ్లపల్లి:** మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్, టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి మద్దతు దారులు వేర్వే రుగా టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు రెడ్డప్పరెడ్డి, ఆధ్వ ర్యంలో ఎన్‌టిఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేసి నివాళులర్పించారు. అక్కడే మాజీ ఎమ్మెల్యే శంకర్ మద్దతు దారులు అక్కడికి వచ్చి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించేందుకు ప్రయత్నించగా ఇరు గ్రూపుల మధ్య వాదోవ వాదాలు చోటు చేసుకున్నాయి. ఎస్ఐ లోకేష్‌రెడ్డి సర్దిచెప్పి ఘర్షణ చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు.

# పౌర హక్కులపై అవగాహన అవసరం



నిమ్మనపల్లి : సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ అమర్నాథ్

**ప్రజాశక్తి-నిమ్మనపల్లె**

భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థ, పావుర హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తహశీల్దార్ అమర్నాథ్, ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి, మదనపల్లె రూరల్ సర్కిల్ సిఐ సత్యనారాయణ అన్నారు. శనివారం నిమ్మనపల్లె పంచాయతీ పరిధిలోని గంగాపురం పల్లెలో పౌర హక్కుల దినోత్సవం సమావేశాన్ని మండల అధికారులతో, దళిత సంఘాల నాయకులతో కలసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం, న్యాయ వ్యవస్థ, పౌర హక్కుల పై ప్రతి ఒక్కరు కనీస అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మండలంలో ప్రతినెల 30న దళితవాడల్లో సివిల్ రైట్స్ డే సమావేశాన్ని నిర్వహిస్తూ వారి సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని పరిష్కరిస్తూ వస్తున్నామని అన్నారు. దళిత వాడల్లో అవసరమైన మౌలిక వసతుల ఏర్పాటు, ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించడానికి, వారి సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతను కల్పిస్తున్నారని అన్నారు. సమావేశంలో వచ్చే ప్రతి అర్జీని స్వీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార మార్గం చూపుతున్నామని పేర్కొన్నారు. గంగాపురంపల్లెలో దళితులకు సంబంధించిన భూములు అన్యాక్రాంతం జరిగాయని, వాటిని సర్వే చేసి దళితులకు తగు న్యాయం చేయాలని గ్రామస్తులు హరి కోరారు. మురుగునీటి కాలువలను ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఎంపిడిఒ పరమేశ్వర్ రెడ్డి స్పందిస్తూ మురుగనీటి కాలువను ఏర్పాటు చేయడానికి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. దళితుల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న మండల అధికారులకు దళిత సంఘాల నాయకులు మునిరత్నం, చంద్రాయుడు, హరి లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ నారాయణ, ఎపిఒ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ మిథున్ చక్రవర్తి, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, రీసర్వే డిటి సిరాజుద్దీన్, మండల సర్వేయర్ గోపీనాథ్, విఆర్ఒ రెడ్డిరాణి, అంగన్వాడీ సూపర్వైజర్ భాను లక్ష్మీదేవి, ఎస్‌బిఐ బ్యాంక్ మేనేజర్ భాను ప్రకాష్, హెడ్ కానిస్టేబుల్ నవ యుగనాథ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. **కలకడ :** మండలంలోని కలకడ పంచాయతీ కొత్తపల్లిలో తహశీల్దార్ ఫణికుమార్ ఆధ్వర్యంలో సివిల్ రైట్స్‌పై సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎస్‌సి, ఎస్‌టిలకు సంబంధించి సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి నెలా సమావేశాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్‌సి కాలనీలలో ఉన్న సమస్యలను మా దృష్టికి తీసుకురావాలని అన్నారు. కొత్తపల్లి గ్రామస్తులు మాట్లాడుతూ వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, రామాలయంకు నిధులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరగా వీలైనంత త్వరలో నూతన రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కాని స్టేబుల్ రమేష్‌కుమార్, విఆర్‌ఒలు షాజహాన్, అనంతరాజు, గ్రామస్తులు, విఆర్ఎ, పోలీసు సిబ్బంది, పాల్గొన్నారు.



కలకడ : గ్రామస్తులకు సూచనలు ఇస్తున్న తహశీల్దార్ ఫణికుమార్

# ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సిఐ



బి.కొత్తకోట : మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సిఐ

**ప్రజాశక్తి-రాయచోటి టౌన్**

వాహన దారులు ట్రాఫిక్ నియమాలు, నిబంధనలు తప్పక పాటింఆలని ట్రాఫిక్ సిఐ విశ్వనాథ రెడ్డి పేర్కొన్నారు. శనివారం కర్నూలు డిఐజి కోయా ప్రవీణ్ ఆదేశాలు మేరకు ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు సూచనల మేరకు పట్టణంలోని సిఆర్ రెడ్డి డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత, సైబర నేరాలు, మహిళలు శక్తి యాప్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలపై ఆ సంస్థ అధినేత శ్రీనివాసులురెడ్డితో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడిన వారు మాత్రమే డ్రైవింగ్ చేసేందుకు అర్హులని 18 సంవత్సరాల కంటే తక్కువ వయసు కలిగిన వారు డ్రైవింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. రవాణా, పోలీసు శాఖ వారి సూచనలు తప్పకుండా పాటించి వాహనాలు సూచించారు. విద్యార్థులు చదువుతోపాటు సమాజంలో జరుగు తున్న సైబర్ నేరాలు ఇతర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం శక్తి యాప్ నూతనంగా శ్రీకారం చుట్టిందని ఆ యాప్‌ను ప్రతి మహిళ విద్యార్థులు ఏర్పాటు చేసుకొని ఆపద సమ యాలలో 112 కు కాల్ చేసి ఆపదల నుంచి రక్షణ పొందాలని సూచిం చారు. కార్యక్రమంలో ఎఎస్ఐ జోసెఫ్, పోలీస్ కానిస్టేబుల్ పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** వాహన దారులకు సిఐ జీవన్ గంగానాథ్‌బాబు వాహన దారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదకరమని, మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష అను భవించాల్సి హెచ్చరించారు. ఆటోడ్రైవర్లు ప్రయాణికులతో మర్యాదగా ప్రవర్తించాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. **పుల్లంపేట :** మైనర్లు వాహనాలు నడుపుట నేరమని పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలపై ఆటోడ్రైవర్లు, వాహన దారులకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు లైసెన్స్ వచ్చిన తర్వాత వాహ నాలు ఇవ్వాలని లేకుంటే తల్లిదండ్రులు పైన కేసులు నమోదు చేస్తామని అన్నారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ తప్పక ధరించాలని, లైసెన్సు కలిగి ఉండాలని, వాహన రికార్డులు దగ్గర ఉంచుకోవాలని సూంచారు. **పుల్లంపేట :** మైనర్లు వాహనాలు నడుపుట నేరమని పుల్లంపేట ఎస్ఐ మోహన్‌కుమార్‌గౌడ్ అన్నారు. ఆటోడ్రైవర్లతో పాటు వాహనదారులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు లైసెన్స్ వచ్చిన తర్వాత వాహనాలు ఇవ్వాలని లేకుంటే తల్లిదండ్రులు పైన కేసు పెట్టారు పెడతామని చెప్పారు. **నందలూరు :** ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాటించాలని ఎఎస్ఐ మోసెస్ పేర్కొన్నారు. మండలంలో ఉన్న ట్రాఫిక్ సమస్యలపై ఆటో డ్రైవర్లకు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా కాకి చొక్కాలు ధరించి, వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలని సూచించారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటివి చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని లేనిపక్షంలో భారీ జరిమానాలు విధించే ఆస్కారం ఉందని వివరించారు. తల్లిదండ్రులు వారి పిల్లల ప్రవర్తన పట్ల గమనిస్తూ చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చూడాలని, ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, చెడు వ్యసనాలు వలన యువత పక్కదోవ పడుతారని వారిని నివారించడంలో తల్లిదండ్రుల పాత్ర ముఖ్యమని అన్నారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు లేకపోతే ప్రస్తుతం అమలవుతున్న జరిమానాలు విధిస్తారని వాహనదారుడు గమనించి మెలగాలని తెలిపారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.



పుల్లంపేట : ట్రాఫిక్ నియమాలపై ఆటోడ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ



మౌనికను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

## ఇన్‌స్పైర్ మనక్‌కు ఎంపికైన మౌనిక

**ప్రజాశక్తి-రాజంపేట అర్బన్**

మండల కేంద్రంలోని గుండ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న మౌనిక ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ నామినేషన్‌కు ఎంపిక కావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బచ్చోటి హరినాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024-25 నామినేషన్స్ లో భాగంగా జిల్లా స్థాయికి తమ పాఠశాల విద్యార్థిని ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు ఇలాంటివి ఎంతో ఉపయోగపడుతాయని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మౌనికను అభినందించి ప్రశంసించారు. కార్యక్రమంలో సైన్సు ఉపాధ్యాయులు సంజీవప్రసాద్, నాగలక్ష్మి ఉపాధ్యాయులు కృష్ణంరాజు, కృష్ణాచారి, రాఘవులు, సుబ్రహ్మణ్యం, యస్వంతి పాల్గొన్నారు.

## జనరల్ సెక్రటరీగా చంద్రబాబు ఎంపిక

**ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్**



మదనపల్లె పట్టణానికి చెందిన జి.చంద్రబాబునాయుడుకి అంతర్జాతీయ పదవి వరించింది. అంతర్జాతీయ మానవ హక్కుల రక్షణ కమిషన్ ఇండియా సౌత్ జోన్ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ఆ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా శనివారం చంద్రబాబు మాట్లాడుతూ మానవ హక్కుల పరిరక్షణ కొరకు తన వంతు కృషి చేస్తానన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికి వారి హక్కులు అనుభవించే స్వేచ్ఛ ఉందని అన్నారు. మానవ హక్కులను ఎవరైనా ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. సంస్థ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని స్పష్టం చేశారు. తనను ఇండియా సౌత్ జోన్ జనరల్ సెక్రటరీగా ఎంపిక చేసినందుకు మానవ హక్కుల అధ్యక్షుడు ముజాహిద్, కంకణాల పెంచలి నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

## పోక్సో చట్టంపై అవగాహన

**ప్రజాశక్తి-నందలూరు**

మండల లీగల్ సర్వీస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో మండల్ లీగల్ సర్వీసెస్ చైర్మన్, నందలూరు జూనియర్ సివిల్ జడ్జి భార్గవిచే శనివారం ప్రజలకు పోక్సో చట్టంపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఆకుల సుబ్రహ్మణ్యం, షేక్ మహమ్మద్‌అలీ, గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, మోహన్, నాయనపల్లి అనుదీప్, ఆనంద్‌కుమార్, అలీ, ఆసియా పాల్గొన్నారు.

## త్వరలో బుడగ జంగాలకు ఎస్‌సి సర్టిఫికెట్లు

**ప్రజాశక్తి - కడప :** త్వరలో బుడగ జంగాలకు ఎస్‌సి సర్టిఫికెట్లు ఇచ్చేందుకు కృషి చేస్తామని కడప ఎమ్మెల్యే రెడ్డప్ప గారి మాధవి అన్నారు. కడప నగరం బేడ బుడగజంగం కాలనీకి చెందిన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు దూపం రాజు, ఉపాధ్యక్షులు డి.శ్రీరా ములు ఆధ్వర్యంలో ఎస్‌సి వర్గీకరణలో తమ కులాన్ని చేర్చి క్యాబినెట్ లో ఆమో దించి కేంద్రానికి పంపి నందుకు రాష్ట్ర ఉపా ధ్యక్షుడు టి.కొండయ్య స్థానిక నాయకులు, విద్యా ర్థులు కలిసి శనివారం ఎమ్మెల్యేను, జిల్లా అధ్య క్షుడు శ్రీనివాసులరెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శివరెడ్డి, సంక్షేమ సంఘం ప్రతి నిధులు జి.కళ్యాణ్, పి. సురేష్, డి.వెంకట్, కె. వెంకటఃరమణ, డి.మల్లి కార్జున పాల్గొన్నారు.

## మెరుగైన సేవలు అందించాలి

**ప్రజాశక్తి - ముద్దనూరు**

ప్రభుత్వం సచివాలయాల ద్వారా పలు సేవలను సిబ్బంది ప్రజలతో సమన్వయం పాటించి మరింత మెరుగ్గా అందించాలని ఎంపిడిఒ ముకుందరెడ్డి సూచించారు. దేనేపల్లె, చింతకుంట గ్రామ పంచాయతీల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలు, అంగన్వాడీ కేంద్రాలు, పారిశుధ్యం పనులను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్యం లోపించకుండా గ్రామాలను శుభ్రంగా ఉంచాలన్నారు. రోజూ చెత్త సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థులు,పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలన్నారు. సచివాలయం సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కత్తెమ్ శ్రీనివాసులు, ఎంపిటిసి వెంకట సుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

# క్రైం కార్నర్



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

## కారు దగ్ధం కేసులో ఒకరు అరెస్టు

**ప్రజాశక్తి-రామసముద్రం**

టిడిపి మండల అధ్యక్షులు విజయ్‌కుమార్‌గౌడ్ ఇన్నోవా కారుకు నిప్పు పెట్టిన నిందితులలో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రవికుమార్ తెలిపిన వివరాల మేరకు.. 15 రోజులు క్రితం అర్ధరాత్రి సమయంలో టిడిపి మండలాధ్యక్షుడి ఇన్నోవా కారుకు ఆయన ఇంటి ఎదుటే గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన కేసును చేధించామని చెప్పారు. ఈ కేసులో గుంతలపేటకు చెందిన శ్రీనివాసులును అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు తెలిపారు. అరెస్టు చూపిన వారిలో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ లోకేష్, కానిస్టేబుల్ కిరణ్‌యాదవ్ ఉన్నారు.

## బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్ర గాయాలు

**ప్రజాశక్తి-రామాపురం**

మండల పరిధిలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారిలోని శివాలయం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైక్ అదుపు తప్పి ఇద్దరికి తీవ్రగాయలైనట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. గాలివీడు మండలం నూలివీడుకు చెందిన ఆవుల ఎర్రగంరెడ్డి మరో బాలిక కడపలో చదువుకుంటున్నారని అన్నారు. ఉగాది పండుగ సందర్భంగా రెండు రోజులు శెలవులు రావడంతో ఇద్దరూ బైక్‌పై ఇంటికి వస్తూ ఉండగా మార్గమధ్యలోకి శివాల యం వద్ద రాగానే ముందు వైపున కడప నుంచి రాయచోటి వైపుకు వస్తున్న ఆర్‌టిసి బస్సు ప్రయాణికుల కొరకు నిలుపుటకు ప్రయత్నం చేయుచుండగా బస్సు వెనక వైపున ఢీకొనడంతో మోటార్ సైకిల్ అదుపుతప్పి రోడ్డుపై పడ్డారని అన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని బాధితులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.